క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని నిరసన


నిరసన తెలియజేస్తున్న ఆశాలు

అద్దంకి: కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి సమసమ్యలు పరిష్కరించాలని ఆశాలు డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలను అమలు చేయాలని కోరుతూ గురువారం ఆశా డే సందర్భంగా మోదేపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆశాలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆశ వర్కర్లు గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిరంతరంగా శ్రమిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకుడు లక్ష్మీ, మస్తాన్ బి, మార్తమ్మ, రజిని, దానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో పనిచేయమనడం దారుణం


వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

కారంచేడు: 100 రోజుల యాక్షన్ ప్లాన్ పేరుతో సెలవు దినాల్లో పనిచేయమనడాన్ని యూటీఎఫ్ తరుపున పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఉపాధ్యాయులు ముక్తకంఠంతో చెప్పారు. గురువారం సాయంత్రం పాఠశాల పని సమయం దాటిని తరువాత మండల కేంద్రం కారంచేడు ఎమ్మార్సీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భవనం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా సెలవు రోజుల్లోనూ పనిచేయాలని ఒత్తిడి చేయడంను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. 10 శాతం మాత్రమే సెలవులను వాడుకోవాలనే నిబంధనను కూడా పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాయచోటి ఘటనలో హెచ్‌ఎంపై విద్యార్థుల దాడిని వారు ఖండించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి రావి పద్మావతి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ శ్రీనివాసరావు, జీ రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన కంప్యూటర్ ల్యాబ్


బల్లికురవ కళాశాలలో ప్రారంభానికి సిద్ధమైన కంప్యూటర్లు

బల్లికురవ: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకూ పెరుగుతున్నందున విద్యార్థులు కూడా ముందుకు సాగాలి. ఈఉద్దేశంతో నెదర్లాండ్ టీమ్, ఎంవీ ఫౌండేషన్ సహకారంతో కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. బల్లికురవలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎంవీ ఫౌండేషన్ రూ. 4.5 లక్షలతో పది కంప్యూటర్లు, పది కుర్చీలు, టేబుళ్లు అందజేశారు. ఇటీవల కళాశాల పరిశీలనకు వచ్చిన నెదర్లాండ్ సభ్యులు విద్యార్థుల కోసం కంప్యూటర్లు అందజేయడంపై ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కంప్యూటర్ వినియోగానికి సంబంధించి ప్రత్యేక గది పూర్తిగా సిద్ధమైంది. రాబోయో వారంలో జిల్లా కలెక్టర్, ఇంటర్ బోర్డు అధికారుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. అనిల్‌కుమార్ సాక్షికి తెలిపారు. ఫౌండేషన్ గత ఐదు సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి చేయూత నిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

నేల తల్లిని కాపాడటం అందరి బాధ్యత


విద్యార్థులు, రైతులతో మానవహారం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

చీరాల రూరల్: రైతులు వ్యవసాయంలో రసాయనిక ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులు వాడితే నేల తల్లిని కొంతవరకైనా కాపాడినవారమవుతామని జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం వీ. వాణిశ్రీ అన్నారు. ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని గవినివారిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. రైతులు, విద్యార్థులతో కలసి మానవహారం ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి ఆదేశాల మేరకు ప్రతి ఏడాది డిసెంబర్ 5న ఆరోగ్యకరమైన నేల ప్రాముఖ్యతపై దృష్టిసారించి ప్రజలకు అవగాహన కలిగిస్తున్నట్లు చెప్పారు. స్థిరమైన మంచి నాణ్యతతో కూడిన నేలపై వ్యవసాయం చేయడం ద్వారా 58 శాతం వరకు ఎక్కువ ఆహార ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుమతి, వ్యవసాయ శాఖ సిబ్బంది, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

బైపాస్.. ప్రమాదాలకు ఫాస్ట్

- బైపాస్ కూడళ్లలో అంధకారం, సూచిక బోర్డులు శూన్యం
- ప్రమాదాల బారిన వాహనదారులు
- రోడ్లపైనే భవన నిర్మాణ మెటీరియల్
- పట్టించుకోని పోలీసులు


చల్లారెడ్డిపాలెం జంక్షన్ వద్ద బైక్ ప్రమాదంలో మృతి చెందిన యువకుడు (ఫైల్)


క్రిస్టల్ సీఫుడ్స్ వద్ద కంకర కుప్పను ఢీకొట్టి మృతి చెందిన యువకుడు (ఫైల్)

వేటపాలెం: తీర ప్రాంత రహదారులు రోజూ రక్తమోడుతున్నాయి. రోడ్డుపై ప్రయాణించాలంటే చాలు భయాందోళన చెందుతున్నారు వాహనదారులు. గతంలోనైనా సూచిక బోర్డులు ఉండేవి. దీంతో చాలా మేరకు ప్రమాదాలను నివారించారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటు పాలకులు, అధికారులు రహదారుల భద్రత విషయంలో పూర్తిగా విఫలమయ్యారు. 216 కత్తిపూడి- ఒంగోలు జాతీయ రహదారిలో వాహనదారులకు రక్షణ కరువైంది. పందిళ్లపల్లి నుంచి ఈపురుపాలెం వరకు గల బైపాస్ రోడ్డులో నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డు ప్రమాదాల్లో కొందరు అక్కడికక్కడే మృత్యువాత పడుతుండగా మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. ప్రతి నెల బైపాస్‌లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

బైపాస్.. ప్రమాదాల నిలయం..

నియోజవర్గ పరిధిలో 216 బైపాస్ పందిళ్లపల్లి వద్ద నుంచి ఈపురుపాలెం వరకు గల గ్రామాలను తాకుతూ పోతుంది. ఈ బైపాస్ రోడ్లకు అనుసంధానంగా గల రోడ్ల కూళ్లలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి వెంబడి గ్రామాలు ఉండటంతో ఈ ప్రజలు పట్టణంలోకి రావాలన్నా, గ్రామాలకు వెళ్లాలన్నా బైపాస్ దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఇటీవల ప్రతి గ్రామం వద్ద గల బైపాస్ కూడళ్లలో దుకాణాలు వెలిశాయి. వీటిలో టీ దుకాణాల దగ్గర నుంచి రెస్టారెంట్ల వరకు ఉన్నాయి. ఇక్కడే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడ ఎటువంటి సూచికలు ఏర్పాటు చేయలేదు. అంతేకాకుండా అక్కడ వాహనాలు అడ్డదిడ్డంగా రహదారిపైనే నిలుపుతుంటారు. రామాపురం జంక్షన్, వేటపాలెం నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం సముద్ర తీరం వెళ్లే జంక్షన్, చల్లారెడ్డిపాలెం నుంచి దేశాయిపేటకు వెళ్లే కూడలి, అక్కాయిపాలెం నుంచి జాండ్రపేట వెళ్లే కూడలి ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

రాత్రి రోడ్డు దాటాలంటే భయం భయం..

రాత్రి సమయాల్లో బైపాస్‌లో చీకటి రాజ్యమేలుతోంది. ముఖ్యంగా గ్రామాలకు వెళ్లే కూడళ్ల వద్ద ఎటువంటి విద్యుత్ దీపాలు లేవు. దీంతో రాత్రి సమయాల్లో ఇక్కడ రోడ్డు దాటాలంటే చాలా భయంగా ఉంటుందని ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బచ్చులవారిపాలెం వెళ్లే కూడలి వద్ద ఎటువంటి సూచికలు ఏర్పాటు చేయలేదు. పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారివారి పాలెం మత్స్యకార గ్రామాలకు వెళ్లే బైపాస్ కూడలి వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది.

కొన్ని ప్రమాదాలు ఇలా..

✦ ఇటీవల ద్విచక్ర వాహనం చల్లారెడ్డిపాలెం నుంచి దేశాయిపేట వస్తున్న ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల బైక్‌ను మినీ లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందారు.


✦ వేటపాలెం బైపాస్ రోడ్డులో చీరాల నుంచి వేటపాలెం వస్తున్న ఇద్దరు వ్యక్తులు రాత్రి వేళలో బైపాస్ రోడ్డు దాటుతున్న గేదెను బైకుతో ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యారు.

✦ 2 డిసెంబర్ సోమవారం రాత్రి పొట్టి సుబ్బయ్యపాలెం గ్రామం సముద్రతీరం నుంచి వేటపాలెం వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు స్నేహితుల్లో ఒకరు మృతి చెందగా మరో స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డారు. క్రిస్టల్ సీఫుడ్స్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న వెంచర్ కోసం రోడ్డుపై పోసి ఉన్న కంకర కుప్పను వేగంగా వచ్చి బైక్ ఢీకొట్టడంతో ఓయువకుడు అక్కడి కక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రగాయాలతో వైద్యశాలలో చేరాడు. వీరి వెనకాలే వస్తున్న మరో ఇద్దరి స్నేహితుల బైక్ వీరిని ఢీకొట్టడంతో వారు కూడా తీవ్రగాయాలపాలయ్యారు.

గతంలో రోడ్డు జంక్షన్‌లో ప్రమాదల నివారణ కోసం అప్పటి జిల్లా ఎపీ ప్రమాదాలు తగ్గించేందుకు స్టాపర్లు, డ్రమ్ములు, ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ప్రధాన బైపాస్ రోడ్డు క్రాస్ చేసే ప్రాంతంలో కూడా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అయితే ఇప్పుడు మాత్రం పట్టించుకునేనాథుడు కరువయ్యారు. ఇటువంటి ప్రమాదాలు నిత్యం కృత్యంగా మారినా చర్యలు శూన్యంగా మారింది. ఇప్పటికైనా పోలీసులు, సంబంధిత అధికారులు సూచక బోర్డులు, డివైడర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు డిమాండ్ చేశారు.

> **ప్రయాణికులకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం..**
> జంక్షన్‌లో వీధిలైట్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడుతాం. హైవే దొంగతనాలపై ప్రత్యేక నిఘాఏర్పాటు చేశాం. ప్రయాణికులకు, వాహనదారులకు ప్రమాదాలపై ఎప్పటికప్పుడు అవగాహనే కల్పిస్తూనే ఉన్నాం.
> – ఎం వెంకటేశ్వర్లు, ఎస్సై, వేటపాలెం

నేడు అయ్యప్పస్వామి షష్టిమహోత్సవం


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామ పంచాయతీ కృష్ణంరాజువారిపాలెం గ్రామంలో కొలువైయున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టిమహోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం కావడులతో గ్రామోత్సవం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి షష్టి వేడుకలను వీక్షించాలని వారు కోరారు.

విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడి మృతి బాధాకరం

మార్టూరు: గురువు ద్వారా మంచి పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థుల చేతుల్లోనే గురువు మృతి చెందడం అత్యంత బాధాకరమని.. ఇది దారుణమైన చర్య అని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడు ఏ గౌస్ మృతి చెందటం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన కలిగించిందని విచారణ వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయులు అభద్రతా భావంతో విధులు నిర్వహిస్తున్నారని అనటానికి ఇదొక ఉదాహరణ అని ఆయన అన్నారు. ప్రభుత్వం ఈ విషయమై లోతుగా విచారణ జరిపి భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నట్లు స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు చింతల సుబ్బారావు, పి నరోత్తమ రెడ్డి ప్రకటనలో కోరారు.

భయపెడుతున్న గ్రామ సింహాలు


మేదరమెట్ల సెంటర్‌లో ఉన్న కుక్కల సమూహం


గ్రామంలోకి వచ్చే ప్రధాన దారిలో గుంపులుగా ఉన్న గ్రామసింహాలు

- భయాందోళన చెందుతున్న గ్రామస్తులు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మేదరమెట్ల: కుక్కలు ఎక్కడ పండితే అక్కడ యథేచ్ఛగా తిరుగుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం ప్రధాన వీధుల్లో గ్రామసింహాలు విచ్చలవిడిగా గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. పనుల కోసం పాదచారులు, వాహనదారులు వీధుల్లో తిరగాలంటే కుక్కల బెడదతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అటుగా వెళ్లే ద్విచక్రవాహనాల వెంట, పాదచారుల వెంట గ్రామసింహాలు పరుగులు తీస్తున్నాయి. చిన్నారులు, మహిళలు కుక్కలు ఉన్న దారిలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. రాత్రి పగలు తేడాలేకుండా వీధుల్లో గుంపులుగా తిరుగుతూ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గ్రామంలోని సెంటర్‌లో, గ్రామంలోకి వచ్చే ప్రధాన దారిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంటుంది. ద్విచక్రవాహనాలపై వెళ్లే వాహనదారుల వెంట కుక్కలు పడి పరిగెత్తడం వాహనాలపై నుంచి కిందపడి ఇటీవల కాలంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. గత వారంలో జే.పంగులూరులో కోతులు దాడి చేసి 10 మందిని గాయపరిచాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కలు, కోతులను దూరంగా పంపించేయాలని డిమాండ్ చేస్తున్నారు.

> **కుక్కల బెడద లేకుండా చూడాలి..**
> పనుల కోసం వచ్చిపోయే మార్గంలో కుక్కల దాడులు ఎక్కువగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అనే భయంతో బిక్కుబిక్కుమంటూ అటుగా వెళ్లాల్సి వస్తుంది. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలి.
> – శ్రీనివాసరావు, మేదరమెట్ల

13 వరకు సముద్రంలో వేట నిషేధం


మత్స్యకారులకు సూచనలందిస్తున్న ఉద్యోగులు

చీరాల టౌన్: బాపట్ల సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి భారత వైమానిక దళం మిస్సైల్ ఫైరింగ్ చేస్తున్నారని.. వాడరేవు ప్రాంత మత్స్యకారులు ఈనెల13 వరకు సముద్రంలో పూర్తిగా వేట నిలుపుదల చేయాలని వాడరేవు మత్స్య సహాయకులు డార్విన్ సూచించారు. గురువారం వాడరేవు సముద్ర తీర ప్రాంతంలో మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా డార్విన్ మాట్లాడుతూ భారత వైమానిక దళం ప్రతీ ఏటా మిస్సైల్ ఫైరింగ్‌ను సముద్రంలో నిర్వహిస్తుంటారని, ఈఫైరింగ్ సమయంలో మత్స్యకారులు వేట నిలుపుదల చేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళీతో పాటుగా వైమానిక దళం వింగ్ కమాండర్‌లు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఫైరింగ్ సమయంలో వేట చేస్తే మిస్సైల్ విస్ఫోటనం జరిగి ప్రమాదాలు జరుగుతాయని, మత్స్యకారులు విధిగా ఉన్నతాధికారుల ఆదేశాల పాటించాలన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండి ఈనెల 13 తేదీ వరకు వేట నిలుపుదల చేసి సహకరించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలను విస్మరించి ఎవరైనా వేట చేస్తే చర్యలు తప్పవని డార్విన్ హెచ్చరించారు.

అంగన్‌వాడీ విద్య ఎంతో విలువైనది


ముప్పవరంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మజ


చెరుకూరులో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ రాధ

జే.పంగులూరు: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు అందించే విద్య విలువైనదని.. దాని ప్రాముఖ్యతను గుర్తించి తల్లులు ప్రతిరోజు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని ఐసీడీఎస్ ముప్పవరం సెక్టార్ సూర్ వైజర్ పద్మజ అన్నారు. గురువారం ముప్పవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే జరిగింది. కార్యక్రమంలో తల్లులకు, చిన్న పిల్లలకు అందించే విద్య, దాని ప్రాధాన్యతపై అవగాహన కలిగించారు. చిన్న వయసులోనే విద్యను అందించడం ద్వారా వారు ప్రతి నిత్య చదువుకోవటాన్ని అలవాటు చేసుకుంటారని, ఆ చదువు ఎంతో విలువైందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

ఒత్తిడి లేని బోధన అందించాలి

పర్చూరు (చినగంజాం): పిల్లలకు ఆటపాటలతో కూడిన ఒత్తిడి లేని ప్రీ స్కూల్ విద్యను అందించాలని చెరుకూరు సెక్టార్ సూపర్ వైజర్ రాధ సూచించారు. మండలంలో పర్చూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని చెరుకూరు సెక్టార్‌లోని కేంద్రాల్లో అంగన్ వాడీ వర్కర్స్‌కు ప్రీ స్కూల్ విద్యపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు ఆటపాటలతో బోధనను చేసే విధానం, ఒత్తిడి లేని బోధనను పిల్లవాడికి అందించే విధానం, మెటీరియల్ వర్క్ బుక్ పిల్లలతో చేయించే విధానం వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సమస్యల పరిష్కార సదస్సులు


తహశీల్దార్ గోపికృష్ణ

చీరాల టౌన్: భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను ఈనెల 6 నుంచి 27 తేదీ వరకు మండలం, మున్సిపాలిటీలో నిర్వహిస్తున్నామని తహశీల్దార్ కుర్రా గోపికృష్ణ తెలిపారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 6వ తేదీ గవినివారిపాలెంలో, 7వ తేదీ ఉదయం దేవినూతల, మధ్యాహ్నం కావూరివారిపాలెం, 10 వతేదీ వాడరేవు, 11న బుర్లవారిపాలెం, 12న తోటవారిపాలెం, 13న ఈపురుపాలెం -1 , 17న వాదపాలాలకు సంబంధించి బోయినవారిపాలెం, 17 మధ్యాహ్నం విజయనగర్‌కాలనీ, 18న దేవాంగపురి, 19న ఉదయం రామకృష్ణాపురం, మధ్యాహ్నం సాల్మన్‌సెంటర్, 20 తేదీ ఉదయం చీరాలనగర్ కొత్తపాలెం, గాంధీనగర్, 27న పేరాల గొల్లపాలెం పొలాలకు ఉజిలీపేట సచివాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు తమకు ఉన్న భూ సమస్యలన్నింటికి తగిన ఆధారాలు, ధ్రువీకరణాలతో అర్జీలు అందించి సత్వర పరిష్కారం పొందాలని తహశీల్దార్ గోపీకృష్ణ సూచించారు.

జే.పంగులూరు మండలంలో..

జే.పంగులూరు: మండలంలోని భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా, వాటిని పరిష్కరించేందుకు గ్రామాలలో ఈ నెల 10వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పీ సింగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ ముప్పవరం, 11న కొండమంజులూరు, 12 న రామకూరు, 13న బైటమంజులూరు, 17న బూదవాడ, 18న కొండమూరు, 19న పంగులూరు, 20న తూర్పు తక్కెళ్లపాడు, 21న నూజిళ్లపల్లి, 24న రేణింగవరం, 26న కశ్యాపురం, 27న అలవలపాడు, 28న కోటపాడు, 31న తూర్పు కొప్పెరపాడు, జనవరి 3వ తేది చందలూరు గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు.

బల్లికురవ మండలంలో..

బల్లికురవ: భూసమస్యల పరిష్కారానికి నేటి నుంచి 2025 జనవరి 7వ తేదీ వరకు 14 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. 6న కొప్పరపాలెం, 7న ఉప్పుమగులూరు, 10 కొణిదెన, 11న మల్లాయపాలెం, 12న నక్కబొక్కలపాడు, 13న గుంటుపల్లి, 17న అంబడిపూడి 18న వెలమవవారిపాలెం, 19న గొర్రెపాడు, కొత్తూరు. 20న చెన్నుపల్లి, 21న బల్లికురవ, 26న కొప్పరపాడు, 27న ఎస్ఎల్‌గుడిపాడు, 2025 జనవరి 2న ముక్తేశ్వరం 3న వల్లాపల్లి, కొమ్మినేని వారిపాలెం, 4న వైదన, 7న కూకట్లపల్లిలో నిర్వహిస్తున్నామని, భూసమస్యలకు సంబంధించి రైతులు పరిష్కరించుకోవాలన్నారు.

యద్దనపూడి మండలంలో..

యద్దనపూడి: నేటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు కె. రవికుమార్ తెలిపారు. శుక్రవారం అనంతవరం, 10 వ తేదీ యనమదల, 11న పోలూరు, 13న పూనూరు, 17న జాగర్లమూడి, 19న వింజనంపాడు, 20న గన్నవరం, 21వ తేది యద్దనపూడి గ్రామ సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తహశీల్దారు తెలిపారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం, శ్రవణం నక్షత్రం, పంచమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నీడ కరువు.. నీరు దొరకదు

- ప్రభుత్వ కార్యాలయాల్లో వసతులు శూన్యం
- అవస్థలు పడుతున్న ప్రజలు


కార్యాలయ మెట్లపై వేచి ఉన్న ప్రజలు, అర్జీదారులు


చీరాల ఎంపీడీవో కార్యాలయం

చీరాల టౌన్: ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయం నిత్యం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రతిరోజు వస్తుంటారు. లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీరు దొరకడం గగనంగా మారింది. తమ సమస్యలను అధికారులకు విన్నవించేందుకు వచ్చిన అర్జీదారులు కూర్చొనేందుకు బల్లలు కూడా లేవు. నిత్యం వందలాది మంది ప్రజలు, అర్జీదారులతో చీరాల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మచ్చుకైనా ప్రజలకు వసతులు కానరాని పరిస్థితి. దీంతో మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

చీరాల మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, ఉపఖజానా కార్యాలయం, రోడ్లు భవనాల శాఖ కార్యాలయం, వెలుగు, హౌసింగ్ కార్యాలయాలు ఉన్నాయి. ఇవేకాక పక్కనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కూడా ఉంది. అన్నీ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఒకేచోట ఉండటంతో నిత్యం చీరాల పట్టణం, రూరల్ గ్రామాల్లోని ప్రజలు అనేక పనుల నిమిత్తం మండల కార్యాలయాలకు వస్తుంటారు. అంతేకాకుండా విద్యార్థుల కూడా తమకు కావాల్సిన పలు ధ్రువీకరణ, రైతులకు అడంగల్, టైటిల్ డీడ్ పత్రాల కోసం, హౌసింగ్ పొజిషన్, పట్టాదారు పాసు పుస్తకాల కోసం రోజూ వందలాది మంది ప్రజలు కార్యాలయాలకు వస్తున్నా నిలువ నీడ లేకుండా పోయింది. ప్రజాధనంతో భవనాలు నిర్మించినా గుక్కెడు నీటిని అందించలేని పాలకులు, అధికారులు ఎందుకని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అత్యవసరంగా మూత్రం వస్తే రూ. 10 ఇచ్చి సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు వారి కార్యాలయాల్లో స్వంతంగానైనా, స్వచ్ఛంద సంస్థల సహకారంతోనైనా మంచినీరు, కూర్చునేందుకు వసతులను కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.